www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 3 ఫిబ్రవరి 2024 5 ఏలూరు



వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల బరిలోకి దిగనున్నారు. గత ఎన్నికల్లో ఇక్కడ వైసిపి నుంచి బరిలోకి దిగి ఎంపీగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజు రెబల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా గూడూరి ఉమాబాలను నియమిస్తూ వైసిపి అధిష్టానం ప్రకటన చేసింది. ఉమాబాల తండ్రి కీర్తిశేషులు పంపన చంద్రశేఖర్ భీమవరం మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌గా పని చేశారు. ఉమాబాల కూడా కాంగ్రెస్ హయాంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేశారు.

హామీలు మరిచారు.. ఓట్ల కోసం వస్తున్నారు..!

ఐదేళ్ల పాలనలో అమలు కాని వైసిపి హామీలు

డోలయమానంలో నిర్వాసితులకు పరిహారం, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం, 'చింతలపూడి' రైతులు

రోడ్లు, వంతెనలపై తీవ్ర నిర్లక్ష్యం

నేడు దెందులూరులో ఎన్నికల 'సిద్ధం' సభ హాజరు కానున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

'మాట తప్పం.. మడమ తిప్పం' అంటూ 2019 ఎన్నికల్లో వైసిపి అధినాయకుడు జగన్ జిల్లాకు పలు హామీలు గుప్పించారు. తమ సమస్యలు పరిష్కారమవుతాయని భావించిన ప్రజానీకం వైసిపికి గంపగుత్తగా ఓట్లు వేసి గెలిపించారు. అధికారంలోకొచ్చిన వైసిపి ఐదేళ్లు గడుస్తున్నా.. జిల్లా ప్రజానీకానికి ఇచ్చిన హామీల్లో ఏఒక్కటీ నెరవేర్చలేదు. ఇప్పుడు 2024 ఎన్నికలకు సన్నద్ధంలో భాగంగా వైసిపి అధ్యక్షుడు జగన్ దెందులూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో శనివారం పాల్గొనున్నారు. దీంతో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల సం'గతేంటీ' జగనన్న అంటూ జనం ప్రశ్నిస్తున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల వేళ ఓట్ల కోసం పలు హామీలు గుప్పించడం, గెలిచిన తర్వాత ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారింది. 2019 ఎన్నికల్లో వైసిపి సైతం ఇదేవిధంగా జిల్లాప్రజానీకానికి ఇచ్చిన హామీల్లో ఐదేళ్లు గడుస్తున్నా ఏఒక్కటీ అమలు చేయలేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల వేళ ప్రజల ముందుకొస్తున్న అధికార వైసిపిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని గత ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చారు. పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచి అందిస్తామన్నారు. తన తండ్రి హయాంలో 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పారు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, కాలనీల నిర్మాణం, భూమికి భూమి వంటి అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేశారు. దీంతో పోలవరం నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి తెల్లం బాలరాజుకు నిర్వాసితులంతా పెద్దఎత్తున ఓట్లు వేసి గెలిపించారు. వైసిపి అధికారం చేపట్టి నాలుగున్నరేళ్లు దాటింది. ఇప్పటి వరకూ పునరావాస ప్యాకేజీ పెంచి అందించడంగాని, భూములకు ఇస్తామన్న పరిహారంతోపాటు నిర్వాసితులకు ఇచ్చిన ఏఒక్క హామీ అమలు చేయలేదు. 2023 ఆగస్టులో వచ్చిన వరదల సమయంలో కుక్కునూరు మండలం గొమ్ముగూడేనికి వచ్చిన సిఎం జగన్ వచ్చే జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వాసితులకు తాను ఇచ్చిన హామీ ప్రకారం పరిహారం అందిస్తామని చెప్పారు. జనవరి గడిచిపోయింది. ఫిబ్రవరి వచ్చేసింది. మరో రెండు, మూడు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. నిర్వాసితులకిచ్చిన హామీ నెరవేరుస్తారా అనేది సందేహాస్పదమే. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు 'సిద్ధం' అంటూ దెందులూరులో సన్నాహక సభ ఏర్పాటు చేస్తుండటంతో నిర్వాసితులకిచ్చిన హామీలపై తీవ్ర చర్చ సాగుతోంది.

కొల్లేరు హామీలు తూచ్..
కొత్తగా ఎకోసెన్సిటివ్ జోన్‌పై ముందుకు

రానున్న ఎన్నికలకు సంబంధించిన సన్నాహక సభను కొల్లేరు ప్రాంతమైన దెందులూరు నియోజకవర్గంలో శనివారం నిర్వహించనున్నారు. ఈ సభకు వైసిపి అధ్యక్షుని హోదాలో జగన్ హాజరు కానున్నారు. గత ఎన్నికల్లో కొల్లేరు ప్రాంతానికి ఇచ్చిన హామీ ఏఒక్కటీ వైసిపి ప్రభుత్వం నెరవేర్చలేదు. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పినా కాగితాలకే పరిమితం చేశారు. కొల్లేరులో రీసర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి జిరాయతీ భూములను రైతులకు అందిస్తామని చెప్పి గాలికొదిలేశారు. కొల్లేరులోకి ఉప్పునీరు చేరకుండా ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం మోళ్లపర్రు, కృష్ణా జిల్లాలోని పడతడక వద్ద మూడు రెగ్యులేటర్లు నిర్మిస్తామని 2023 జూన్‌లో శంకుస్థాపన చేస్తామని సైతం చెప్పారు. ఇప్పటి వరకూ అతీగతీ లేదు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని కొల్లేరు ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. టిడిపి హయాంలో కొల్లేరు మూడో కాంటూరుకు కుదింపుపై అసెంబ్లీలో తీర్మానం సైతం చేశారు. ఈ తీర్మానానికి అప్పటి ప్రతిపక్ష హోదాలో ఉన్న వైసిపి భేషరతుగా మద్దతు పలికింది. ఇప్పుడు అది మరిచి కొల్లేరును ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో పదో కాంటూరు వరకూ విస్తరించేందుకు సిద్ధమైంది. హెలికాప్టర్లతో సర్వే, మండల కేంద్రాల్లో అభిప్రాయ సేకరణ, కొల్లేరు పరిసర ప్రాంతాల ఎంఎల్‌ఎలతో కలెక్టరేట్‌లో సమావేశాలు సైతం జరిగిపోయాయి. కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలోకి వస్తే మరో 89 గ్రామాలు ఆ పరిధిలోకి వెళ్లడమే కాకుండా కొల్లేరు అభివృద్ధి పూర్తిగా నిలిచిపోనుంది. గత ఎన్నికల్లో కొల్లేరు ప్రాంత ప్రజలకు వైసిపి ఇచ్చిన హామీలు ఏమిటీ.. ఇప్పుడు చేస్తున్నదేమిటంటూ అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొల్లేరు ప్రాంతానికి వస్తున్న జగన్ దీనిపై ఏం మాట్లాడతారో చూడాలి.

పత్తా లేని వాటర్‌గ్రిడ్.. 'చింతలపూడి' రైతులకు దగా

ఆక్వా చెరువులతో తాగునీరు కలుషితమైందని, తాము అధికారంలోకి వస్తే వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో వైసిపి అధ్యక్షుడు జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దానికి రూ.3,200 కోట్లు కేటాయించినట్లు హడావుడి చేశారు. తర్వాత డెల్టా ప్రాంతానికి మాత్రమే పరిమితం చేస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లు గడుస్తున్నా జిల్లాలో వాటర్‌గ్రిడ్ పూర్తి చేయలేదు. జనాలకు తాగునీరు అందించలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని టిడిపి ప్రభుత్వ హయాంలో అనేక ఆందోళనలు చేశారు. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామంటూ వైసిపి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పటికీ చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతులకు న్యాయం జరగని పరిస్థితి.

పామాయిల్ ఫ్యాక్టరీ ఆధునికీరణ, డెల్టా ఆధునికీకరణ తూచ్

జిల్లాలో పెద్దఎత్తున పామాయిల్ సాగవుతోంది. తాము అదికారంలోకి వస్తే పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ అది జరగలేదు. టిడిపి హయంలో డెల్టా ఆధునికీకరణ గురించి వైసిపి నాయకులు తరచూ ప్రశ్నించేవారు. వైసిపి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పక్కన పెట్టేసింది. తూడు, గుర్రపుడెక్క తీయడంతోనే సరిపెట్టేసింది. దీంతో తుపాన్లు, వర్షాలకు ప్రతియేటా రైతులు పెద్దఎత్తున పంటను కోల్పోవడమే కాకుండా, సాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్లు, వంతెనల పరిస్థితీ అంతే

గత ఎన్నికల్లో ప్రధానంగా రోడ్ల దుస్థితిపైనే ప్రచారం సాగింది. రోడ్ల పరిస్థితిపై ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుతం వైసిపి ఎంఎల్‌ఎలుగా ఉన్న నాయకులు పాదయాత్రలు సైతం చేశారు. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో రోడ్ల వ్యవస్థ బాగు చేయని పరిస్థితి నెలకొంది. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఏలూరు కాలువపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదు. రోడ్లు, వంతెనల నిర్మాణాలను పట్టించుకోని పరిస్థితి. తుందుర్రు ఫుడ్‌పార్క్‌ను సముద్రపు ఒడ్డుకు తరలిస్తామని, నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని ఇలా అనేక హామీలు ఇచ్చినప్పటికీ వైసిపి ఏఒక్కటీ నెరవేర్చని పరిస్థితి ఉంది. దీంతో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఓట్లు ఎలా అడుగుతారని జనంలో తీవ్ర చర్చ సాగుతోంది.

నేడు సిఎం పర్యటన సాగేదిలా

ఎన్నికల సన్నాహక సభకు హాజరు

మూడు జిల్లాల నుంచి తరలిరానున్న వైసిపి నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల సన్నాహక కార్యక్రమంలో భాగంగా శనివారం ఏలూరు శివార్లలో జాతీయ రహదారికి ఆనుకుని సహరా గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభకు సిఎం జగన్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనున్నారు. ఈ సభకు సిఎం జగన్ మధ్యాహ్నం 2.40 గంటలకు తాడేపల్లి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 3.25 గంటలకు దెందులూరు సమీపంలో హైవే పక్కన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 3.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3.30 నుంచి 4.45 గంటల వరకూ బహిరంగసభలో ప్రసంగిస్తారు. 4.55 గంటలకు తిరిగి హెలీకాప్టర్‌లో బయలుదేరి 5.40 గంటలకు సిఎం తన నివాసానికి చేరుకుంటారు. సిఎం ఎన్నికల సభ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం రాకుండా వాహనాల మళ్లింపు చేపట్టారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను పూర్తి చేశారు. వైసిపి నాయకులు సభ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎఎస్‌పి, డిఆర్ఒ, నూజివీడు ఆర్‌డిఒ

కొలువుదీరిన కొత్త అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

డిఆర్‌ఒగా పుష్పమణి బాధ్యతల స్వీకరణ

జిల్లా రెవెన్యూ అధికారిగా డి.పుష్పమణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిఆర్‌ఒను అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎఎస్‌పి

జిల్లా అదనపు ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన జి.స్వరూపారాణి శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

నూజివీడు ఆర్‌డిఒ భవాని శంకరి

నూజివీడు ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన వై.భవానిశంకరి శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు.

నూజివీడులో ధర్నా నిర్వహిస్తున్న న్యాయవాదులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని కోర్టు భవనాల ఎదుట ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సెక్రటరీ మడుపల్లి మధురవిశంకర్ మాట్లాడుతూ ఎపి టైటిలింగ్ యాక్ట్‌తో యజమానులకు తమ భూములపై హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యాక్టు రద్దయ్యే వరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదని, ప్రజలందరూ తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లాయర్లు బసవరావు, నరసింహారావు, రమేష్, రామారావు పాల్గొన్నారు.

5న 'రా.. కదలిరా' సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

సభా స్థలిని పరిశీలిస్తున్న నేతలు

ఈ నెల 5న చింతలపూడిలో రా.. కదలిరా' సభను జయప్రదం చేయాలని తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అని చెప్పి రాష్ట్ర ప్రజలను సిఎం జగన్ నిలువునా మోసగించారని ఆయన విమర్శించారు. చింతలపూడి పట్టణంలో ఈ నెల 5న నిర్వహించనున్న 'రా.. కదలిరా' కార్యక్రమ ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఒక అవకాశం ఇవ్వమని ప్రజలను కోరి, అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తర్వాత ఇచ్చిన హామీలన్నీ మరిచిందన్నారు. సిఎం జగన్ ఎవరి మాట వినకుండా తాడేపల్లి ప్యాలెస్‌కు మాత్రమే పరిమితమయ్యారన్నారు. అరకొర సంక్షేమంతో మోసగిస్తున్నారన్నారు. 5న చంద్రబాబు సభకు టిడిపి శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ జగ్గరవరపు ముత్తారెడ్డి, టిడిపి నేతలు బొమ్మాజీ అనిల్‌కుమార్, జనసేన నేతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా పర్యటనలా..!

సిఎం జగన్‌కు సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి - ఏలూరు

సిఎం జగన్ జిల్లా పర్యటన సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆ పార్టీ తరఫున బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆ లేఖలోని అంశాలను శుక్రవారం విడుదల చేశారు. పోలవరం నిర్వాసితులకు కుటుంబానికి రూ.10 లక్షల ప్యాకేజీ ఇస్తానని చెప్పారని, పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామన్నారని, కొల్లేరు వాసులకు మూడో కాంటూరుకు కుదించి ప్రభుత్వ భూములు పేదలకిచ్చి జీవనోపాధి కల్పిస్తామని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మూడు రెగ్యులేటర్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. నూజివీడు మామిడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణం పునాదులు కూడా పడలేదన్నారు. ఏలూరు స్మార్ట్‌సిటీ ఫైళ్లల్లోనే బంది అయిందన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా ఆస్తులు, భూములు కార్పొరేట్లకు కట్టబెట్టే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని జనం కోరితే దానిపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. జిల్లాలో పేదలు, దళితులు, గిరిజనుల ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణ లేదన్నారు. ఏలూరు పక్కనే దోసపాడులో 300 ఎకరాలు అన్యాక్రాంతమైనా చర్యలు లేవన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ భూములు ఇలాగే ఉన్నా చర్యలు తీసుకోలేదన్నారు. గిరిజనులు సాగులో ఉన్న ఎల్‌టిఆర్ భూములకు ఒక్కరికైనా హక్కు కల్పించారా అని ప్రశ్నించారు. ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు, అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు ఎందుకు హక్కులు కల్పించరన్నారు. ఏలూరు జ్యూట్, భీమడోలు షుగర్స్ తదితర ఫ్యాక్టరీలను తెరిపించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏంటని ప్రశ్నించారు. ఉపాధి కల్పించడానికి చర్యలేంటని, జిల్లాలో ఒక్క పరిశ్రమ అయినా స్థాపించారా అని ప్రశ్నించారు. జిల్లాలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వీటి మరమ్మతులు, పునరుద్ధరణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏంటన్నారు. జిల్లాలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, ఇవేమీ పరిష్కరించకుండా వ్యర్థ పర్యటనలు ఎందుకని రవి విమర్శించారు. జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సిఎం జగన్ సభకు కట్టుదిట్టమైన బందోబస్తు

ప్రజలు సహకరించాలి

పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్‌పి ప్రశాంతి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగర శివారు దెందులూరు మండలంలో సిఎం జగన్ సిద్ధం బహిరంగ సభకు వస్తున్న సందర్భంగా కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేశామని, వాటితోపాటు రాష్ట్ర జాతీయ రహదారిలో దారి మళ్లింపు చర్యలు చేపట్టామని, వీటికి ప్రజలు సహకరించాలని ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. ఏర్పాటుచేసిన బందోబస్తును సమర్థంగా నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం సభ జరిగే ప్రాంతంలో బందోబస్త్ విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులతో, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. బందోబస్త్ ఏర్పాట్ల గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సభా ప్రాంగణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. సభా స్థలికి వచ్చే వాహనాలు సరైన దారిలో వస్తున్నాయో లేదో చూడాలన్నారు. వివిఐపిల భద్రత ముఖ్యమని, ఆ దిశగా వ్యూహాత్మకంగా వ్యవహరించాలన్నారు. సభ అనంతరం ప్రజలు వారివారి గమ్య స్థానాలనకు సురక్షితంగా చేరేలా చూడాలన్నారు. ప్రజలతో సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు 3298 మంది పోలీసు అధికారులను, సిబ్బందిని బందోబస్త్‌కు వినియోగిస్తున్నామన్నారు. ఏడుగురు అదనపు ఎస్‌పిలు, 23 మంది సిఐలు, 78 మంది ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, 197 మంది ఎఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 478 మంది కానిస్టేబుళు,, 1119 మంది మహిళా కానిస్టేబుళ్లు, 199 మంది హోంగార్డులు, 80 మంది మహిళా హోంగార్డులు, 60 మంది ఎఆర్ సిబ్బందితో పాటు స్పెషల్ పార్టీ టీమ్‌లను కేటాయించామన్నారు. అదనపు ఎస్‌పి స్వరూపారాణి, ఎస్‌ఇబి అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

కుక్క కాటుకు గురైన బాలుడు మృతి

వైద్యులు, అధికారుల నిర్లక్ష్యమే కారణమని వాపోతున్న తల్లిదండ్రులు

బాలుని మృతదేహం

ప్రజాశక్తి - లింగపాలెం, చింతలపూడి

వైద్యులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని మండలంలోని గణపవారిగూడేనికి చెందిన సాత్విక్(9) తల్లిదండ్రులు వాపోతున్నారు. జనవరి ఆరో తేదీన సాత్విక్‌పై పిచ్చికుక్క దాడి చేసింది. ఈ దాడిలో సాత్విక్ చెవిపై గాయమైంది. బాలుడిని తల్లిదండ్రులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అదే నెలలో రెండు వ్యాక్సిన్లు వేశారు. ఈ క్రమంలో 23వ తేదీన బాలుడికి జ్వరం రావడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు కుక్క కరిచిన చెవి వద్ద ఇన్ఫెక్షన్ వచ్చిందని, విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. బాలుడిని విజయవాడ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల ఒకటో తేదీన మృతి చెందాడు. ఏలూరు ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మెరుగైన వైద్యం అందించకపోవడంతోనే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొర పెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

గణపవారిగూడెంలో పిచ్చికుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, ప్రజలపై దాడి కూడా చేశాయని స్థానికులు చెబుతున్నారు. చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు వాపోతున్నారు.

బాలుడు డెంగీ వ్యాధితో మృతి చెందాడని, పిచ్చి కుక్క దాడి చేయడం వల్ల కాదని అధికారులు పక్కదోవ పట్టించేందుకు చూస్తున్నారని మృతుని బంధువులు చెబుతున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో విజయవాడ ఆసుపత్రికి రిఫర్ చేసినప్పుడు వైద్యులు డెంగీ జ్వరం ఉందని చెప్పలేదని తల్లిదండ్రులు తెలిపారు. వైద్యులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమా కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు వాపోతున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'తో ప్రజల్లో క్రీడా సంస్కృతి

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మండల స్థాయిలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలు శుక్రవారంతో ముగిశాయి. అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, ఇడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్‌ఎంఆర్ పెదబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ప్రజల్లో క్రీడా సంస్కృతి ద్వారా ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహించిందన్నారు. సాయంత్రం పూట ఆడుకోవడం మరిచిపోయిన పరిస్థితుల్లో అందరూ శారీరక దృఢత్వంతో ఆరోగ్యంతో ఉండాలనే మంచి ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నగదు బహుమతులు ఇచ్చి క్రీడాకారులను, క్రీడాభిమానులు ప్రోత్సహించిన సిఎం జగన్‌కు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో డిసెంబర్ 26 నుంచి కలిసికట్టుగా సమన్వయంతో ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రీడోత్సవాల్లో జిల్లాలో 1.45 లక్షల మంది పాల్గొన్నారన్నారు. ఈ నెల ఆరో తేదీ నుంచి వైజాగ్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఏలూరు జిల్లాను మొదటి స్థానంలో నిలిపి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి బి.లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు 322 ఆట స్థలాలను గుర్తించి నిర్వహించినట్లు చెప్పారు. .జిల్లాస్థాయిలో 64 మ్యాచ్‌లను నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందించామన్నారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో గెలిచిన జట్లు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరచి జిల్లాకు ఎక్కువ బహుమతులు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా తొలుత స్పోర్ట్స్ అంబాసిడర్లు బి.మాధురి, డి.ప్రసాద్‌లను సత్కరించారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు కప్పు, మెడల్స్‌తో పాటు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామారావు, స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఇండియా అధికారి వినయ్‌ప్రసాద్, పిఇటి అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిపిఒ శ్రీనివాస్ విశ్వనాథ్, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు, డిఎస్‌ఒ ఆర్ ఆర్. రాజు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ క్వాలిఫైయింగ్ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఇంటర్మీడియట్ క్వాలిఫైయింగ్ పరీక్ష ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్ ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్మీడియట్ వత్తి విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 124 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు సాధారణ విభాగంలో 13,517 మంది, 13,290 మంది హాజరు కాగా 227 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 2,147 మందికి 2,031 మంది హాజరు కాగా 116 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ప్రభాకరరావు తెలిపారు. శనివారం జరగాల్సిన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఈ నెల 23వ తేదీకి వాయిదా పడినట్లు ఆయన తెలిపారు.

చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల ఎనిమిదిన తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో కలిసి శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు మంగమ్మ, పుల్లమ్మ, సావిత్రి, లక్ష్మీకాంతం, కుమారి, సత్యవతి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరందించే విధంగా పైపులైన్ పనులను ప్రారంభించనున్నట్లు సర్పంచి మెండ భూదేవి తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి పైపులు పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్‌ను తీసుకొచ్చిందన్నారు. అంతేకాకుండా సుమారు రూ.84 లక్షల నిధులను కూడా కేటాయించారన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో కుళాయి లేని ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పైపులైన్లు వేసే క్రమంలో ప్రజలు పంచాయతీకి సహకరించాలని ఆమె కోరారు.

'పెత్తందారుల చేతిలో కీలుబొమ్మలా విజయరాజు'

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభంపాటి విజయరాజు మండలంలోని పెత్తందారుల చేతిలో కీలుబొమ్మగా మారారని, అహంకార వైఖరి మారకపోతే ఓడిపోవడం ఖాయమని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అలగ రవికుమార్ అన్నారు. పట్టణంలో నగర పంచాయతీ వద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.50 కోట్లతో కామవరపుకోట మండలం కొండగూడెం నుంచి బొర్రంపాలెం వరకు రహదారి నిర్మిస్తే కనీసం స్థానిక ఎంఎల్‌ఎకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించకుండా ఏ అర్హతతో విజయరాజు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. పెత్తందారుల చేతిలో విజయరాజు కీలుబొమ్మగా మారి వ్యవహరిస్తున్నారన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రత్తికోళ్లలంక, గుడివాకలంక గ్రామాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు కొల్లేరు నాయకులు ఘంటసాల వెంకటలక్ష్మి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ చిత్తడి నేలల ప్రాధాన్యాన్ని గుర్తించడంతో పాటు వాటి పరిరక్షణ, అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులు కొల్లేరు చిత్తడి నేలలను పరిరక్షించి పర్యావరణం కాపాడాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.

మండవల్లి :జీవవైవిధ్యానికి అనువుగా ఉండే చిత్తడి నేల కొల్లేరును పరిరక్షించుకోకపోతే భవిష్యత్ తరాల మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండలాధ్యక్షుడు బి.అప్పారావు అన్నారు. జాతీయ చిత్తడి నేల దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రమైన మండవల్లిలో శుక్రవారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి చిత్తడి నేల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్‌విన్ భాస్కరరావు పాల్గొన్నారు.

సారధి కళాశాలలో టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పల్లెర్లమూడిలోని సారథి ఇంజినీరింగ్ కళాశాలలో కాకినాడ జెఎన్‌టియు అంతర్ కళాశాలల టెన్నిస్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంఎల్‌సి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం పెంచుకుని విద్యార్థులు జాతీయస్థాయికి ఎదగాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక ఈద్గా కాలనీలో రూ.55 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, ఇందిరా కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ.18 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైను పనులను ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం మండలంలోని పడమటిపాలెం బ్రిడ్జికలగురువులో రూ.20 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సిసి రోడ్డును, కలిదిండి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రూ.25.50 లక్షలతో నిర్మించిన ముఖ మండపాన్ని ప్రారంభించారు.

జన సైనికుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

పవన్‌కల్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేపడుతున్న భీమడోలు గ్రామానికి చెందిన జన సైనికుల సేవలు అభినందనీయమని ఆ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ సమన్వయకర్త పి.ధర్మరాజు అన్నారు. భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని సూర్యారావుపేట ఆవాస ప్రాంతానికి చెందిన దంపతుల్లో ఒకరు పాక్షిక అంధత్వం, మరొకరు కాలు చచ్చుబడి అతి కష్టంపై జీవనం సాగిస్తున్నారు. తమకు పింఛను మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ వివిధ కారణాలవల్ల మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు పత్తి మదన్ ఆధ్వర్యంలోని జన సైనికులు 16 నెలల కాలంగా నెలకు రూ.మూడు వేలు వంతున వారికి అందిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ మొత్తాలను ధర్మరాజు చేతులమీదుగా బాధితులకు అందించారు. సేవా కార్యక్రమాలు చేపట్టిన జన సైనికులను ధర్మరాజు అభినందించారు.

దిశా వన్ స్టాప్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ ఆధ్వర్యంలో కార్యదర్శి కె.రత్నప్రసాద్ స్థానిక దిశా వన్ స్టాప్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. దిశా వన్ స్టాప్ సెంటర్ పని చేస్తున్న విధివిధానాలను, బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారు నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేశారు. దిశా వన్ స్టాప్ సెంటర్‌లో ఉన్న భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని (నిశ్చింత) సందర్శించి వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, వైద్య సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న వృద్ధులకు ప్రభుత్వం అందించే పథకాలపై, సీనియర్ సిటిజన్ యాక్టుపై అవగాహన కల్పించారు.

నేరాలు - ఘోరాలు

నాలుగు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... పెదపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ శుభ శేఖర్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఓ బస్సును తనిఖీ చేస్తున్న సమయంలో ఒక వ్యక్తి వద్ద నాలుగు కేజీల గంజాయిని పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి గంజాయితో పాటు రూ.పదివేల నగదు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులం ప్రాంతానికి చెందిన ఇబ్రహీం హెరిస్‌గా గుర్తించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన బీరబోయిన రమణమ్మకు చెందిన పూరిల్లు విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఇంట్లో ఉన్న సామగ్రిని స్థానికులు బయటకు తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఇల్లు పూర్తిగా కాలిపోయిందని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బీరబోయిన రమణమ్మ వాపోయారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


కొయ్యలగూడెం : వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే మంచి లక్ష్యాలతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందన్నారు. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరు గారుస్తున్నాయన్నారు. పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో సమస్యలతో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎండి ఆశా, కె.కుమారి, అడపా రమాదేవి, రౌతు వరలక్ష్మి, ఎ.కృష్ణవేణి, ఎన్.రేణుక, రౌతు బేబీకుమారి పాల్గొన్నారు.

నిడమర్రు :మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు డిమాండ్ చేశారు. నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో వెంకాయమ్మ అధ్యక్షతన మధ్యాహ్న భోజన కార్మికులు సమావేశం నిర్వహించారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. వారి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒ రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వరప్రసాద్, మైలవరపు నాగలక్ష్మి, కోరాడ వెంకటరమణ, యాల సత్యవతి, జ్యోతి, పి.గంగాభవాని, చోడవరం పద్మ, పి.నాగగంగాభవాని, పెద్దిరెడ్డి సూర్యకాంతం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు : డిపిఒ

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామంలోని ప్రజలకు తాగునీరందించే విషయంలో గ్రామంలో నెలకొన్న సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని డిపిఒ టి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. పంచాయతీ చెరువును మంచినీటి అవసరాలకు తీర్చే విధంగా వినియోగించాలని గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించడంతో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు చావులపాడులో శుక్రవారం విచారణ చేపట్టారు. పంచాయతీకి చెందిన 13.5 ఎకరాల చెరువును ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీకి లీజుకు ఇచ్చారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న మంచినీటి చెరువు ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చలేకపోతుందని, 13.5 ఎకరాల చెరువులో ఐదు ఎకరాలు విడగొట్టి తాగునీటికి వినియోగించుకునేలా చేయాలని ప్రజలు పంచాయతీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పంచాయతీ గ్రామస్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో మంచినీటి చెరువు చేసే విధంగా పంచాయతీ తీర్మానించింది. చెరువును విడగొడితే జీవనోపాధి కోల్పోతామని, విడదీయవద్దంటూ ఫిషర్‌మెంట్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు పంచాయతీని కోరారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఇచ్చిన ఆదేశాలతో జిల్లా అధికారులు చావులపాడు చెరువును, చెరువు పరిసరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి గ్రామస్తులతో, ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో కుటుంబాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో తాగునీటి అవసరాలు మరింత పెరిగాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారమయ్యే విధంగా విచారించి నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని

చెరువును పరిశీలిస్తున్న డిపిఒ

తెలిపారు. సమస్య పరిష్కరమయ్యేవరకు ఇరు గ్రూపులు సమన్వయంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌సి ఎన్‌వి సత్యనారాయణ, డిఎల్‌పిఒ పూర్ణచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కృష్ణారావు, ఇఒపిఆర్‌డి ఆనందబాబు, సర్పంచి తలారి ధనలక్ష్మి, కార్యదర్శి కొండలు పాల్గొన్నారు.

15,240 మందికి వైఎస్ఆర్ ఆసరా సొమ్ము జమ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల మార్కెట్ యార్డులో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 1524 పొదుపు సంఘాలకు 15240 మంది సభ్యులకు సుమారు రూ.16 కోట్లు ఆసరా ద్వారా అందించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడారు.


ఆక్వా హబ్ ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎ

ఫిష్ ఆంధ్రాతో స్వయం ఉపాధి

ప్రజాశక్తి - కలిదిండి

ఫిష్ ఆంధ్రా ఆక్వా హబ్ అవుట్ లెట్ల ఏర్పాటు వల్ల స్వయం ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. కలిదిండిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా ఆక్వా హబ్‌ను వారు ప్రారంభించారు. ఏర్పాటుకు ముందుకు వచ్చిన నిర్వాహకులు హబిబుల్లా ఖాన్‌ను అభినందించారు. ఆక్వా హబ్‌లో ప్రదర్శించిన చేపలను పరిశీలించారు. జిల్లాలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన తొలి ఆక్వా హబ్ అని మత్స్య శాఖ జిల్లా డిఎఫ్ఒ కెఎస్‌వి.నాగలింగాచార్యులు అన్నారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి, సర్పంచి మసిముక్కు మారుతీప్రసన్న వెంకటేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఎఎంసి ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, వక్ఫ్ బోర్డ్ సభ్యులు చాన్ భాషా, ఎండి జిక్రియ, సొసైటీ అధ్యక్షులు వడుపు రామారావు, బాదంపూడి, కైకలూరు ఎడిలు బి.నరసయ్య, చాంద్ బాషా, కలిదిండి, కైకలూరు ఎఫ్‌డిఒలు బి.శ్రీనివాసరావు, ఎం.భవిత పాల్గొన్నారు.

ఉంగుటూరు తహశీల్దార్‌గా వెంకటశివయ్య

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు తహశీల్దార్‌గా వెంకట శివయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో తహశీల్దార్ల బదిలీల క్రమంలో కృష్ణా జిల్లా పెనమలూరు తహశీల్దార్ బదిలీపై ఉంగుటూరు వచ్చారు. ఇక్కడి తహశీల్దార్ ఎవి.రమణరావు తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిపించి అన్నీ పార్టీల మన్ననలు పొందేలా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పని చేస్తానని వెంకట శివయ్య అన్నారు. బదిలీపై వెళ్లిన ఎవి.రమణారావును కార్యాలయ ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఎన్నికల డీటీ పోతురాజు, విఆర్‌ఒలు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

టి.నరసాపురం ఎస్ఐగా దుర్గామహేశ్వరరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం నూతన ఎస్ఐగా డి.దుర్గామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన లక్కవరం ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై టి.నరసాపురం వచ్చారు. ఇక్కడ పని చేసిన బి.సురేంద్రకుమార్ ఆగిరిపల్లి బదిలీపై వెళ్లారు.

నూజివీడు ఆర్‌డిఒగా భవానిశంకరి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ఆర్‌డిఒగా భవానిశంకరి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. తిరుపతిలో కెఆర్‌సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఆమె నూజివీడు ఆర్‌డిఒగా బదిలీ అయ్యారు.

నూజివీడు ఎంపిడిఒగా కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ఎంపిడిఒగా కె.కిరణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా తణుకు నుంచి నూజివీడుకు బదిలీ అయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు ఎంపిడిఒగా విధులు నిర్వహించిన విజయకుమార్ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆగిరిపల్లి ఎంపిడిఒగా శామ్యూల్

ఆగిరిపల్లి :ఆగిరిపల్లి ఎంపిడిఒగా పి.శామ్యూల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నిడదవోలు ఎంపిడిఒగా పని చేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆగిరిపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. ఆగిరిపల్లి మండల ఎస్ఐగా బి.సురేంద్రకుమార్ బాధ్యతలు చేపట్టారు. టి.నరసాపురం ఎస్ఐగా పని చేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆగిరిపల్లి మండల ఎస్ఐగా నియమితులయ్యారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

ప్రమాదాలకు డ్రైవర్లే కారణమంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశమైన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామ రాజు ఆటోడ్రైవర్ల యూనియన్ సమావేశం పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులో పదేళ్ల జైలు శిక్ష, రూ.పది లక్షల జరిమానా విధిస్తామంటూ చేసిన భారతీయ న్యాయ సంహిత 106(1)(2) చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుక్కునూరులో సుమారుగా వందకు పైగా ఆటోలు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న ఆటో డ్రైవర్లుకు పార్కింగ్ స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ కార్యదర్శి ఘంటసాల రమేష్, నిమ్మల శివ, గరటం హరీష్, దార కృష్ణ, సూభాన్, ఉదయ్, రాము, సతీష్, వెంకన్న, సాయి పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై సిఎం దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాకు వస్తున్న సిఎం జగన్ రైతాంగ సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా కమిటీ తరపున బహిరంగ లేఖ రాశారు. ఏలూరు అన్నే భవనంలో బహిరంగ లేఖను రైతు సంఘం నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. గత ఎన్నికల ముందు చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని, భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు అమలు కాలేదని చెప్పారు. ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ఆధునీకరించాలని చెప్పారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

జిల్లాలో పేదలకు చెందిన 16 రకాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేస్తూ రేపు దెందులూరు పర్యటన చేస్తున్న సిఎం జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖను శు స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అసైన్డ్, సీలింగ్, గయళ్ల భూములు, అటవీ భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ, అటవీ శాఖాధికారులు విఫలమయ్యారన్నారు.

పోస్టల్ ప్రమాద బీమాను వినియోగించుకోండి

ప్రజాశక్తి - మండవల్లి

ఆపద సంభవించిన వారి కుటుంబాల్లో పోస్టల్ ప్రమాద బీమా ఆర్థిక వెలుగులు నింపుతుందని భైరవపట్నం పోస్ట్‌మ్యాన్ గుండు సీతారామాంజనేయులు స్పష్టం చేశారు. మండవల్లికి చెందిన గూడవల్లి రాజేంద్ర ఇటీవల ప్రమాదానికి గురవ్వడంతో పోస్టల్ ప్రమాద బీమా ద్వారా వచ్చిన సొమ్మును ఆయన శుక్రవారం బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లికి చెందిన గూడవల్లి రాజేంద్ర 2022 డిసెంబర్‌లో రూ.399 చెల్లించి ప్రమాద బీమా తీసుకున్నారన్నారు. 2023లో రాజేంద్ర ప్రమాదానికి గురై కుడి కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారన్నారు. సమాచారం అందుకున్న సత్యనారాయణ స్పందించి బాధితుడిని ఆదుకునే విధంగా పది రోజుల్లో క్లైమ్ పూర్తి చేయించారన్నారు. బీమా ద్వారా వచ్చిన రూ.35,216 ఇంటి వద్దనే బాధితునికి అందించారన్నారు. పోస్టల్ ప్రమాద బీమా పథకం కాకుండా ఇంకా అనేక బీమాలు ఉన్నాయని, వాటిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకుని ప్రమాద సమయాల్లో లబ్ధి పొందాలని కోరారు. అనంతరం బాధితునికి నగదును అందించారు.

'అవకాశమిస్తే టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తా'

ప్రజాశక్తి - పోలవరం

బుట్టాయగూడెం మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన యర్రాయిగూడెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ కుంజం వసంతవిజయ అవకాశం ఇస్తే పోలవరం నియోజకవర్గం నుంచి టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేస్తానని శుక్రవారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె వృత్తి రీత్యా ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. తాను చేస్తున్న వృత్తిని విడిచిపెట్టి రాజకీయ రంగంలో ప్రవేశించి ప్రజలందరికీ సేవ చేస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి తన ఎజెండాలో కొన్ని ముఖ్యమైన అంశాలను పొందుపరచుకుని టిడిపి అధిష్టానానికి పంపించానని చెప్పారు. పోలవరం ఏజెన్సీ గ్రామ ప్రజలకు న్యాయం చేస్తానని, నిరుద్యోగ యువతకు, వృద్ధులకు, నిరుపేదలకు తగిన విధమైన సహాయ సహకారాలు అందిస్తానని, గిరిజన మహిళనైన తనకు టిడిపిలో అవకాశం ఇచ్చేలా నియోజకవర్గ ప్రజలందరూ తనను రాజకీయాల్లోకి ఆహ్వానించి ఆశీర్వదించాలని కోరారు. కుంజం వసంత విజయ మంచి సేవా స్వభావం కలిగి అందరిని ఆప్యాయతగా పలకరిస్తూ, విద్యార్థులకు మంచి బోధన అందిస్తారని, సమాజ సేవ పట్ల ఎంతో అంకితభావం కలిగిన ఆమె రాజకీయంలో ప్రవేశించడం పట్ల ప్రస్తుతం ఆమె విధులు నిర్వహిస్తున్న యర్నగూడెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు హర్షం వ్యక్తం చేశారు.

కొల్లేరు ప్రజలు పార్టీలకతీతంగా పోరాడాలి

ప్రజాశక్తి - నిడమర్రు

ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలపై యుద్ధం చేయడం, వారి జీవనాన్ని దెబ్బతీయటం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. నిడమర్రులోని ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు అధ్యక్షతన శుక్రవారం సిపిఎం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు మాట్లాడుతూ కొల్లేరు ఆపరేషన్ పేరుతో నాడు రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కొల్లేరు ప్రజల పొట్ట కొట్టి పర్యాటక అభివృద్ధి పేరుతో ఉపాధి కల్పిస్తామని నమ్మబలికిందన్నారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు ఎనిమిది మండలాల్లో వేలాదిమంది కొల్లేరు ప్రజలు పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్లిపోయారన్నారు. వలసలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కొల్లేరు ప్రజలు పార్టీలకు అతీతంగా పోరాడాలని, కొల్లేరు ప్రజల పక్షాన ఉండే పార్టీలకే ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శులు గవర సత్యనారాయణ, కోనా శ్రీనివాస్, వెలగలేటి మోహన్, కంచం ప్రసాద్, లావేటి చంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలి

భీమడోలు :మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులందరూ పోషకాహారం తీసుకునేలా చైతన్యపరచాలని విద్యా శాఖకు చెందిన మధ్యాహ్న భోజన పథకం అదనపు డైరెక్టర్ షరీఫ్ కోరారు. మండల వనరుల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం మండలంలో విద్యా శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్ అధ్యక్షత వహించారు.

16న గ్రామీణ బంద్

ప్రజాశక్తి - ముసునూరు

మోడీ అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఈ నెల 16వ తేదీన గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నట్లు అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ తెలిపారు. మోడీ హటావో దేశ్ బచావో నినాదంతో రానున్న ఎన్నికల్లో మోడీని గద్దె దించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేముల బక్కయ్య, పామర్తి రామారావు, రాజేశ్వరి, భవాని, చంటి, చినబాబు, రాణి పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

ముదినేపల్లి :మండల తహశీల్దార్‌గా పనిచేసి ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా బదిలీ అయిన ముదినేపల్లి తహశీల్దార్ కె.శ్రీనివాస్‌ను శుక్రవారం సత్కరించారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ తన కార్యాలయంలో వైసిపి నాయకులతో కలిసి శ్రీనివాస్‌ను శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం శ్రీనివాస్ మండలంలో చేసిన సేవలను కొనియాడారు.

దాతల సాయం అభినందనీయం

భీమడోలు :గుండుగొలను కేంద్రంగా పని చేస్తున్న శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి అందిస్తున్న సేవలకు దాతలు తమ వంతు సహకారాన్ని అందించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. సేవా సమితి ద్వారా నెలవారీ చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా ప్రతి నెలా మాదిరిగా స్థానికంగా 55 మంది వికలాంగులకు బియ్యం, పండ్లు ఇతర వస్తువులను శుక్రవారం కార్యాలయం వద్ద చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో అందించారు. వీటిని దాత దాట్ల అర్జునరాజు సమకూర్చారు. కార్యక్రమానికి వచ్చిన వికలాంగులకు భోజనం ఇతర ఏర్పాట్లను మత్తేవారిగూడెం గ్రామానికి చెందిన దాతలు ఉచ్చుల హరికృష్ణ, వంశీ అందించారు.

నేడు ప్రజా వేదిక

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉపాధి హామీ చట్టం 2022-23 సంవత్సరానికి సంబంధించి మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రజా వేదిక (సోషల్ ఆడిట్) కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ ఎపిఒ జాన్‌వెస్లీ తెలిపారు.

పిఆర్‌టియు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కార సాధనలో పిఆర్‌టియు ఎప్పుడూ ముందుంటుందని జిల్లా అధ్యక్షులు పి.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఎపికుంట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పిఆర్‌టియు ఉపాధ్యాయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయులు మాట్లాడారు. సంఘ గౌరవాధ్యక్షులుగా ఎస్‌యుఎ కెహెచ్.సత్యనారాయణరాజు, అధ్యక్షులుగా కొసకళ్ల కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా పి.అజయ్, మహిళల సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా జ్యోతి, సుధారాణి ఎన్నికయ్యారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో నాణ్యమైన వైద్యం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని జెడ్‌పిటిసి సభ్యులు మల్లం వసంతరావు అన్నారు. మండలంలోని పి.అంకంపాలెం పంచాయతీలో ఏర్పాటు చేసిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు.సురక్ష క్యాంపునకు వచ్చిన వారికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు.

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku

E.P. 69/2023, OS. 89/2021

Between:
DHR: Karri Prabhakara Reddy
JDR: Pethani Anantha Nagaraju

DHR తరపున చేసిన ప్రకటన

JDR: Pethani Anantha Nagaraju, S/o. Ranga Rao, Hindu, Male, 41 years, Employee, D.No. 5-172, Gubbala Kesavarao Street, Opp: Y Not Shopping Mall, Palangi Village, Undrajavaram Mandal.

పై నెంబరు E.P. గ్రంధములో JDR అయిన మీకు పై కోర్టు వారి ఆదేశం ప్రకారం ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీకు అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా మీరు **ది. 07-2-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియపరచుకొనవలసినదిగాను, అట్లు కాని యెడల పై కోర్టు వారు మీపై పరోక్షమున తీర్మానించుదురని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియపరచుచున్నాము.

A.RAVIKUMAR
E.V.S.PRASAD
Advocates, Tanuku

ప్రకటన

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియరు సివిలు జడ్జి వారి కోర్టులో

O.S. No. 6/2023

Between:
సత్తి వెంకటరెడ్డి -వాది
మరియు
కురెళ్ళ రామలింగేశ్వరరావు -ప్రతివాది

To:
కురెళ్ళ రామలింగేశ్వరరావు, S/o. వెంకట్రాజు, వయస్సు 75 సం॥లు, హిందువు, మత్స్యపురి కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు మాజీ ప్రెసిడెంటు, R/o. D.No. 2-24/2, మత్స్యపురి - 534207, వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భీమవరం PJCJC.

పై నెంబరు దావా గ్రంధములో మీకు ఎన్నిమార్లు కోర్టు నుండి దావా సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనకపోవుట వలన ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరు దావా గ్రంధము పై కోర్టులో **దివి. 28-02-2024వ తేదీకి వాయిదా కలదు. ఆరోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు పై కోర్టులో స్వయముగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ సంజాయిషీ తెలియపరచవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల మీకు పై దావా గ్రంధములో వాదన లేదని దావా మీ పరోక్షములో తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

K.M.M.SRINIVASA REDDY
అనపర్తి Advocate, Anaparthi
ది.02-02-2024 Cell: 9849135411

ప్రకటన

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియరు సివిలు జడ్జి వారి కోర్టులో

I.A. No. 187/2023, O.S. No. 6/2023

Between:
సత్తి వెంకటరెడ్డి -పిటీషనరు/వాది
మరియు
కురెళ్ళ రామలింగేశ్వరరావు -రెస్పాండెంటు/ప్రతివాది

To:
కురెళ్ళ రామలింగేశ్వరరావు, S/o. వెంకట్రాజు, వయస్సు 75 సం॥లు, హిందువు, మత్స్యపురి కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు మాజీ ప్రెసిడెంటు, R/o. D.No. 2-24/2, మత్స్యపురి - 534207, వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భీమవరం PJCJC.

పై నెంబరు దావా గ్రంధములో పిటీషనరు/వాది పిటీషను పరిహారములు కోరుచూ పిటిషను షెడ్యూలు ఆస్తిని తోడజప్తు చేయమని మీపై పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో కోర్టు నుండి మీకు ఎన్నిమార్లు నోటీసు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా సదరు నోటీసును తీసుకునియుండలేదు. పై నంబరు పిటిషను పై కోర్టు వారి ఎదుట **దివి. 28-02-2024వ తేదీకి వాయిదా కలదు. ఆరోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ సంజాయిషీ తెలియజేసుకోవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల పై నంబరు పిటిషనులో మీకు వాదన లేదని పిటిషను మీ పరోక్షములో తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

K.M.M.SRINIVASA REDDY
అనపర్తి Advocate, Anaparthi
ది.02-02-2024 Cell: 9849135411